# 56

# పాపము మనలను దేవుని నుండి వేరు చేయును

## (యెషయా 59)

ప్రజల పాపమునకు సంబంధించిన సమస్యను మరియు దానికి గల నిరీక్షణతో కూడిన ఒకే విడుదల పరిష్కారాన్ని ఈ 59వ అధ్యాయంలో, యెషయా మూడు విభాగాలుగా స్పష్టంగా వివరిస్తున్నాడు. (1) వారిని దేవుని నుండి వేరుచేయు ఒక అడ్డుగోడను పాపము నిర్మించినదను వాస్తవాన్ని ఆయన నొక్కివక్కాణిస్తున్నాడు (వచనాలు 1–8). (2) ఎంతో గొప్ప నష్టము ఫలితంగా ఏర్పడిన గందరగోళము వలన కలిగిన అనుభూతికి వారి అవినీతియే కారణమైనదని ఆయన ఒప్పుకొనుచున్నాడు (వచనాలు 9–15ఎ). (3) దేశానికి అవసరమైయున్న విమోచనా నిరీక్షణ దేవుడే అను సత్యాన్ని ఆయన నివేదించాడు (వచనాలు 15బి–21).

### పాపమునకు సంబంధించిన సమస్య (59:1–8)

రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచకాలేదు
విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు
మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను
మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను
గనుక ఆయన ఆలకింపకున్నాడు.

ప్రజలు అన్యాక్రాంతము చేయబడి తెంచివేయబడిన అనుభూతి చెందారంటే అది దేవుని తప్పు కాదు. "మీ దోషములు" మరియు "మీ పాపములు" (వచనం 2) హెబ్రీ వాక్యభాగములో నొక్కిచెప్పబడిన స్థాయిలో వ్రాయబడియున్నవి. అన్యాక్రాంతము చేయబడుటకును తెంచివేయబడుటకును గల మూలమును అవి నొక్కివక్కాణించుచున్నవి. రక్షింపనేరక యుండునట్లు దేవుడు శక్తిలేనివాడు కాదు సరికదా ఆలకింపకుండుటకు అయిష్టపడువాడు కూడా కాడు (వచనం 1), కానీ ఆయన పరిశుద్ధతకు విరోధముగా మనము చేయు పాపము మనకును దేవునికిని మధ్య ఒక అడ్డగోడను నిర్మిస్తుంది. ఇదే విషయాన్ని యోహాను భక్తుడు ఇలా చెప్పుచున్నాడు: "ఆయనతో కూడ సహవాసముగలవారమని చెప్పుకొని చీకటిలో నడిచిన యెడల, మనమబద్ధమాడుచు సత్యమును జరిగింపకుందుము" (1 యోహాను 1:6).

యెషయా దాని పాపముల క్రమబద్ధమైన కథనముతో కూడిన నిందను యూదాపై మోపుచున్నాడు. ఈ కుటిలము మరియు దౌర్జన్యము వారి సమాజములోని అణువణువునా అలుముకొనిపోయాయి:

మీ చేతులు రక్తముచేతను మీ వ్రేళ్లు దోషముచేతను
  అపవిత్రపరచబడియున్నవి
మీ పెదవులు అబద్ధములాడుచున్నవి

మీ నాలుక కీడునుబట్టి మాటలాడుచున్నది.
నీతినిబట్టి యెవడును సాక్ష్యము పలుకడు
సత్యమునుబట్టి యెవడును వ్యాజ్యెమాడడు
అందరు వ్యర్థమైనదాని నమ్ముకొని మోసపుమాటలు పలుకుదురు
చెడుగును గర్భము ధరించి పాపమును కందరు.
వారు మిడునాగుల గుడ్లను పొదుగుదురు
సాలెపురుగు వల నేయుదురు
ఆ గుడ్లు తినువాడు చచ్చును
వాటిలో ఒకదానిని ఎవడైన త్రొక్కినయెడల విషసర్పము పుట్టును.
వారి పట్టు బట్టనేయుటకు పనికిరాదు
వారు నేసినది ధరించుకొనుటకు ఎవనికిని వినియోగింపదు
వారి క్రియలు పాపక్రియలే
వారు బలాత్కారము చేయువారే.
వారి కాళ్లు పాపముచేయ పరుగెత్తుచున్నవి
నిరపరాధులను చంపుటకు అవి త్వరపడును
వారి తలంపులు పాపహేతుకమైన తలంపులు
పాడును నాశనమును వారి త్రోవలలో ఉన్నవి
శాంతవర్తనమును వారెరుగరు
వారి నడవడులలో న్యాయము కనబడదు
వారు తమకొరకు వంకరత్రోవలు కల్పించుకొనుచున్నారు
వాటిలో నడచువాడెవడును శాంతి నొందదు.

వారి క్రియలు సామెతలు 6:16–19లో ఒక జాబితాగా లిఖింపబడియున్న హేయములకు సమాంతరమయ్యాయి: "అహంకారదృష్టి," "కల్లలాడు నాలుక," "నిరపరాధులను చంపు చేతులు," "దుర్యోచనలు యోచించు హృదయము," "కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములు," "లేని వాటిని పలుకు అబద్ధసాక్షి," "అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడు." జిమ్ మెక్గ్విగ్గన్ ఈ వచనముల సారాంశాన్ని ఇలా చక్కగా వర్ణిస్తున్నాడు: "వారు కుటిల మనస్సులు కలిగియున్నారు గనుక కుటిలముగా వారేర్పరచుకొన్న కుటిలమైన వారి స్వంత మార్గములలో కుటిలమైన కార్యములు చేయుదురు. వారి కుటిలమైన మార్గములలో వారితో కూడ సహవసించుటకు ఆశించు మూర్ఖుడెవరైనను అశాంతిని మరియు వినాశమును మాత్రమే అనుభవిస్తారు."[1]

### పాపము వలన కలుగు ఫలితములు (59:9–15ఎ)

కావున న్యాయము మాకు దూరముగా ఉన్నది
నీతి మమ్మును కలిసికొనుటలేదు
వెలుగుకొరకు మేము కనిపెట్టుకొనుచున్నాము గాని
    చీకటియే ప్రాప్తించును
ప్రకాశముకొరకు ఎదురుచూచుచున్నాము గాని
    అంధకారములోనే నడచుచున్నాము
గోడ కొరకు గ్రుడ్డివారివలె తడవులాడుచున్నాము
కన్నులు లేనివారివలె తడవులాడుచున్నాము

సంధ్యచీకటియందువలెనే మధ్యాహ్న కాలమున
    కాలు జారి పడుచున్నాము
బాగుగ బ్రతుకుచున్నవారిలోనుండియు
    చచ్చినవారి వలె ఉన్నాము.
మేమందరము ఎలుగుబంట్లవలె బొబ్బరించుచున్నాము
గువ్వలవలె దుఃఖరవము చేయుచున్నాము
న్యాయముకొరకు కాచుకొనుచున్నాము గాని అది లభించుటలేదు
రక్షణకొరకు కాచుకొనుచున్నాము గాని అది మాకు దూరముగా ఉన్నది
మేము చేసిన తిరుగుబాటుక్రియలు నీ యెదుట విస్తరించియున్నవి
మా పాపములు మామీద సాక్ష్యము పలుకుచున్నవి
మా తిరుగుబాటు క్రియలు మాకు కనబడుచున్నవి.
మా దోషములు మాకు తెలిసేయున్నవి.
తిరుగుబాటు చేయుటయు
యెహోవాను విసర్జించుటయు
మా దేవుని వెంబడింపక వెనుకదీయుటయు
బాధకరమైన మాటలు విధికి వ్యతిరిక్తమైన
    మాటలు వచించుటయు
హృదయమున యోచించుకొని అసత్యపు మాటలు పలుకుటయు
ఇవియే మావలన జరుగుచున్నవి.
న్యాయమునకు ఆటంకము కలుగుచున్నది
నీతి దూరమున నిలుచుచున్నది
సత్యము సంతవీధిలో పడియున్నది
ధర్మము లోపల ప్రవేశింపనేరదు.
సత్యము లేకపోయెను
చెడుతనము విసర్జించువాడు దోచబడుచున్నాడు

యూదా యొక్క అవినీతి వలన కలిగిన ఫలితాన్ని యెషయా వివరించాడు (వచనాలు 9-15ఎ). ఈ విభాగము జాతీయ పాపము మరియు వారి పాపమునకు పరిణామముగా కలుగు పర్యవసానముల గూర్చిన ఒక ఒప్పుకోలును కనుపర్చుచున్నది. ప్రజలు "న్యాయము"ను మరియు "నీతి"ని వక్రీకరించారు (వచనం 9); గనుక ఇప్పుడు వారి ప్రవర్తనకు తగిన భయభీతిని గొలుపు పర్యవసానములను పంటను, వ్యక్తిగతముగానైతేనేమి ఒక జనాంగముగానైతేనేమి, వారు కోసెదరు. ఈ వాక్యభాగము రాజైన దావీదు బత్షెబతో పాపము చేసిన తరువాత ఒప్పుకొనిన (కీర్తనలు 51) సంఘటన యొక్క సంస్కరణయై యున్నది.

"వెలుగు కొరకు మేము కనిపెట్టుకొనుచున్నాము, గాని చీకటియే ప్రాప్తించును, ప్రకాశము కొరకు ఎదురుచూచుచున్నాము, గాని అంధకారములోనే నడచుచున్నాము" అని యెషయా చెప్పుచున్నాడు. "వెలుగు" మరియు "చీకటి" యొక్క రూపకాలంకార ఉపయోగము ప్రవక్తయైన యెషయా యొక్క ప్రత్యేక ఇతివృత్తమై యున్నది. ప్రజలు "యెహోవా వెలుగులో నడుచుకొనవలెనని" ఆయన సవాలు విసిరాడు (2:5) మరియు వారు "చీకటి వెలుగనియు వెలుగు చీకటనియు" ఎంచుకొనకూడదని వారిని హెచ్చరించాడు (5:20). దేవుడు వారిని

"అన్యజనులకు వెలుగు"గా నియమించి యున్నాడని వారికి తెలియజెప్పాడు (42:6). ఇంకా, "వెలుగును సృజించువాడును అంధకారమును కలుగజేయువాడును" దేవుడే అనియు (45:7) "జనములకు వెలుగు కలుగునట్లుగా" ఆయన తన న్యాయమును విధించుననియు వారికి గుర్తుచేసాడు (51:4).

"ద్వితీయోపదేశకాండము 28:28–29లో దేనికి వ్యతిరేకముగానైతే మోషే హెచ్చరించాడో ఆ నిబంధన శాపము పాపభూయిష్టమైన ఈ దేశాన్ని దాటిపోయింది" అని క్లైడ్ ఎమ్. వుడ్స్ చెప్పుచున్నాడు.[2] ఈ ఉపద్రవము యూదా చేసిన పాపముల ఫలితమైయున్నది. "గోడ కొరకు గ్రుడ్డివారివలె తడవులాడుచున్నాము, కన్నులు లేనివారి వలె తడవులాడుచున్నాము" (వచనం 10ఎ) అను ఈ మాటలు, ప్రజలకు ప్రవచింపవలసినదని దేవుడైన యెహోవా యెషయాను పంపినప్పుడు పలికిన 6:10లోని, మాటలను మన మనస్సులకు జ్ఞాపకంచేయుచున్నవి. దేవుని సేవకుడు "గ్రుడ్డివారి కన్నులు తెరచును" అని 42వ అధ్యాయం చెప్పుచున్నది (వచనం 7). ఏదిఏమైనా, ప్రజలు న్యాయము మరియు రక్షణను అనుభవించునట్లు వారి తిరుగుబాటుతనము, పాపములు, మరియు దోషముల గూర్చి పశ్చాత్తాపపడవలసి యుండినదని మనము గమనిస్తున్నాము (59:11, 12).

"న్యాయము" మరియు "నీతి" (వచనం 14ఎ) నైతిక సూత్రముల నుండి తలెత్తు నైతిక ఆచరణను సూచించుచున్నవి.[3] "సత్యము" మరియు "ధర్మము" (వచనం 14బి) నైతిక సూత్రములన్నిటికి మూలాధారమై యున్నవి. "సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము" అని యేసు పరలోకమందున్న తండ్రికి ప్రార్థించాడు (యోహాను 17:17). మనము సత్య వాక్యమును, అనగా పరిశుద్ధ బైబిలును, ఆలింగనము చేసికొనుకొలది మాత్రమే, మనము న్యాయము చేయగలము మరియు నీతిని అభ్యసించగలము. ఈ మందలింపును మనస్సున నుంచుకొనుటకు విఫలమగుట వలన ఒకడు "దోపిడీసామగ్రి"యై (వచనం 15ఎ), చెడు ఉద్వేగములకును దుర్మార్గపు చర్యలకును బలియగును.

## ప్రతీకారము చేయు విమోచకుడు (59:15బి–21)

న్యాయము జరుగకపోవుట యెహోవా చూచెను అది
    ఆయన దృష్టికి ప్రతికూలమైయుండెను.
సంరక్షకుడు లేకపోవుట ఆయన చూచెను
మధ్యవర్తి లేకుండుట చూచి ఆశ్చర్యపడెను.
కాబట్టి ఆయన బాహువు ఆయనకు సహాయము చేసెను
ఆయన నీతియే ఆయనకు ఆధారమాయెను.
నీతిని కవచముగా ఆయన ధరించుకొనెను
రక్షణను తలమీద శిరస్త్రాణముగా ధరించుకొనెను
ప్రతిదండనను వస్త్రముగా వేసికొనెను
ఆసక్తిని పైవస్త్రముగా ధరించుకొనెను
వారి క్రియలనుబట్టి ఆయన ప్రతిదండన చేయును
తన శత్రువులకు రౌద్రము చూపును
తన విరోధులకు ప్రతికారము చేయును
ద్వీపస్థులకు ప్రతికారము చేయును.

పడమటి దిక్కుననున్నవారు యెహోవా నామమునకు భయపడుదురు
సూర్యోదయ దిక్కుననున్నవారు ఆయన మహిమకు భయపడుదురు
యెహోవా పుట్టించు గాలికి కొట్టుకొనిపోవు ప్రవాహ
    జలమువలె ఆయన వచ్చును.
సీయోనునొద్దకును యాకోబులో తిరుగుబాటు చేయుట
    మాని మళ్లుకొనిన వారియొద్దకును విమోచకుడు వచ్చును
ఇదే యెహోవా వాక్కు
నేను వారితో చేయు నిబంధన యిది
-నీ మీదనున్న నా ఆత్మయు
నేను నీ నోటనుంచిన మాటలును
నీ నోటనుండియు నీ పిల్లల నోటనుండియు
నీ పిల్లల పిల్లల నోటనుండియు
ఈ కాలము మొదలుకొని యెల్లప్పుడును తొలగిపోవు
అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.

యూదాలో "న్యాయము" (వచనం 15బి) లేకుండినందు వలన, వారికి ఎటువంటి నిరీక్షణ లేకుండాపోయింది. "విజ్ఞాపనము చేయుటకు మధ్యవర్తి లేకుండుట" దేవుడు చూచాడు (వచనం 16), ఏలయనగా అందరును ఒకే రీతిలో పాపమునకు బలిపశువులు మరియు దుష్కార్యములు చేయువారునై యుండిరి. కాబట్టి, విమోచనా తెరువు విషయంలో దేవుడు తానే చొరవ తీసికొనును. మానవుని బలహీనతకును ("సంరక్షకుడు లేకపోవుట అయన చూచెను, మధ్యవర్తి లేకుండుట చూచి ఆశ్చర్యపడెను") దేవుని శక్తికిని మధ్య గల తారతమ్యము పరిశీలింపబడింది (వచనం 16). "దేవుని బాహువు" తరుచుగా ఆయన యొక్క అమితమైన బలమునకు మరియు శక్తిసామర్థ్యమునకు ఒక రూపకాలంకరామై యుంటున్నది (52:10; ద్వితీయోపదేశకాండము 5:15 చూడుము). ఎఫెసీయులకు 6:10-17లో వ్రాయబడియున్న క్రైస్తవ కవచముతో యెషయా 59:17వ వచనములో గల దేవుని కవచమును పోల్చిచూడుము. ఈ రెండు జాబితాలలోను "నీతియను మైమరువు" మరియు "రక్షణ యను శిరస్త్రాణము" చేర్చబడియున్నవి. విశ్వాసఘాతకులైన తన ప్రజలు మరియు వారి శత్రువుల గూర్చి దేవుడు ప్రతీకారము చేయును (వచనం 18). ఆయన ఎల్లప్పుడు అన్నింటిని, ఇశ్రాయేలును మాత్రమే కాదు గాని, సమస్త దేశములను ఆయన అధీనములోనే ఉంచుకొంటున్నాడు.

"గనుక వారు యెహోవా నామమునకు భయపడుదురు" అని యెషయా రచించాడు (వచనం 19). "భయము" అను పదము ఈ సందర్భంలో విపరీతమైన భయము మరియు ఆశ్చర్యంతో కూడిన భయము అను రెండు భావములను తెలియజేయుచున్నది. దేవుని చిత్తమునకు విరోధముగా పోరాడినవారికి విపరీతమైన భయము మరియు ఆయన యెదుట వినయముతో మెలగువారికి ఆశ్చర్యంతో కూడిన భయము లేక పుజ్యాభావము పుట్టును.

ప్రవక్త చేయుచున్న తరువాతి ప్రకటన నిరీక్షణ గూర్చినది: "సీయోను నొద్దకును, యాకోబులో తిరుగుబాటుచేయుట మాని మళ్లుకొనినవారి యొద్దకును విమోచకుడు వచ్చును" (వచనం 20). "విమోచకుడు" అను పదము తన సమీపబంధువుకు సహాయము

చేయుటకు అవసరమగు పూర్తి మూల్యమును చెల్లించువానిని తెలియజేయు పారిభాషిక పదమై యున్నది. మన "విమోచకుడు" క్రీస్తైయున్న యేసే అని పౌలు చెప్పుచున్నాడు (రోమీయులకు 11:26, 27).

"నేను వారితో చేయు నిబంధన ఇది" అని యెహోవా సెలవిచ్చుచున్నాడు (వచనం 21). దేవుడైన యెహోవా ఇశ్రాయేలుతోను యూదాతోను సీయోను పర్వతముపై చేయబడిన నిబంధనవలె ఉండని ఒక నూతన నిబంధనను చేయునని ప్రవక్తయైన యిర్మీయా ప్రవచించాడు (యిర్మీయా 31:31-34). హెబ్రీ పత్రిక రచయిత యిర్మీయా పలికిన ప్రవచనాన్ని యేసునకును క్రైస్తవ యుగమునకును వర్తింపజేసాడు (హెబ్రీయులు 8:1-13). దేవుని "ఆత్మ" వారిపై నిలిచియుండును గనుక దేవుని "మాటలు" వారికి రానున్న తరములన్నిటిలోను మార్గనిర్దేశనము నిచ్చును.

సూచనలు

[1]Jim McGuiggan, *The Book of Isaiah,* Looking Into The Bible Series (Lubbock, Tex.: Montex Publishing Co., 1985), 297. [2]Clyde M. Woods, *People's Old Testament Notes: Isaiah* (Henderson, Tenn.: Woods Publications, 2002), 259. [3]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 491.

## వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

### ❖❖❖ పాపము యొక్క స్వభావము ❖❖❖
### (అధ్యాయం 59)

పాపమును గూర్చిన అంశమును ఈ అధ్యాయంలో యెషయా సవిస్తరంగా ఇమిడ్చాడు. సబ్బాతును పాటించుటలో ప్రజలు విఫలులైన విషయాన్ని మరియు ఉపవాసాచారమును వారు అనుచితంగా ఉపయోగించుట గూర్చి చర్చించిన తరువాత, పాపము గూర్చి సర్వసామాన్యంగా వివరించుటకు మొదలుపెట్టాడు. ఆయన చేసిన గద్దింపులో, మనము పాపము యొక్క స్వభావమును చూడగలము.

*మొదటిగా, పాపము వేరుపర్చునని ఆయన చెప్పాడు.* "ఇదిగో, రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచకాలేదు; విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు కానీ మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను, మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు" (వచనాలు 1, 2). దేవుడు తన శక్తిని కోల్పోలేదు. ఆయన చిత్తప్రకారము చేయువారిని రక్షింపనేరక యుండునట్లు ఆయన హస్తము కురుచ కాలేదు. వినగల సామర్థ్యమును ఆయన చెవులు కోల్పోలేదు. ఆయన బలము మరియు ప్రతిసంరక్షణ నిమిత్తము ఆయనకు మొరపెట్టువారి ప్రార్థనలు విననేరక యుండునట్లు ఆయనకు చెవిటితనం కలుగలేదు.

వారికి దేవునితో ఉండాల్సిన సత్సంబంధమునకు వారి పాపములు అడ్డుపడినందువలన

యూదాప్రజలు దేవుని విడుదలను చూడలేదు. వారికిని దేవునికిని మధ్య వారి ఉల్లంఘనలు ఒక అటంకముగా నిలిచి ఆయన వారి జీవితాల్లో లేకుండా చేసాయి. ఇలా ఏర్పడునను విషయము వాస్తవమై యున్నది, ఏలయనగా పాపమును ఆలింగనము చేయువానిని దేవుని నుండి వేరుచేయుటయే పాపము యొక్క స్వభావమై యున్నది. పాపము చేత పొదుగబడిన గ్రుడ్డును ఆరగించువాడు దేవుడు లేకుండా ఒంటరిగానే మరణిస్తాడు.

*రెండవదిగా, పాపము పెత్తనం చెలాయిస్తుందని ఆయన చెప్పాడు.* ఒక పాపము మరొక పాపమునకు దారి తీస్తుంది, ఇలాగ త్వరలోనే పాపము యొక్క ఒక అల్లిక తయారై, ఆంక్షలు విధిస్తూ బానిసగా చేస్తూ జీవితంలోని ఇతర అంశాలన్నిటిలోనికి పాకిపోతుంది. పాపమునకు ద్వారము తెరచువాడు పాపము వానిని ఒక అతిథిగా సందర్శించుటకు లోనికి ప్రవేశించలేదని కనుగొంటాడు; అతిథిగా వచ్చిన అది అతిథేయిగా, సొంతదారునిగా, యజమానిగా మారి వాని ఒంటినేగాక ఇంటిని సహితం తన అధీనంలోనికి తీసుకొంటుంది. దేవుని ప్రజలు చెడు మార్గములలో వారి కాళ్లున్నారు. చెడు చేయుటకు వారి పాదాలు పరుగెత్తాయి, నిరపరాధుల రక్తము చిందించుటకు త్వరపడ్డారు, మరియు వారి ఆలోచనలు దోషసహితమైనవై యున్నవి. విధ్వంసము మరియు వినాశనము వారి రాజమార్గములయ్యాయి (వచనం 7). సమాధానమంటే ఏమిటో ఎరుగని ఒక కాలంలోనికి వారు వచ్చారు. వారిమార్గాల్లో న్యాయమనునది లేదు, మరియు వారి మార్గములను వారు వంకరగా చేసికొన్నారు (వచనం 8). దుష్టుడు పరిపాలించవలెనని వెదుకుచున్నాడు; వాని దాసులు వాని పనులు చేయుటకే వానికి బద్ధులైయుండవలెనని వాడు కోరుచున్నాడు. పాపము అధికారి-కంగా అదుపులో ఉంచుకొంటుంది మరియు మనోహరంగా మరులుగొల్పుతుంది.

*మూడవదిగా, పాపము చిన్నబుచ్చుతుందని ఆయన చెప్పాడు.* తుట్టతుదకు, దేవుడు పాపమునకు తీర్పుతీర్చాల్సిందే. ఆయన నీతియే ఇటువంటి తీర్పును స్వాధికారంతో అడుగుచున్నది. “వారి క్రియలనుబట్టి, ఆయన ప్రతిదండన చేయును, తన శత్రువులకు రౌద్రము చూపును, తన విరోధులకు ప్రతికారము చేయును; ద్వీపస్థులకు ప్రతికారము చేయును” (వచనం 18). ఇట్టి తీర్పు శత్రువునకును ఇశ్రాయేలుకును ఒకే విధంగా తీర్చబడుతుంది. పాపము, పాపమే, మరియు అది ఎక్కడ కనిపించనా దేవుడు దానికి తీర్పు తీర్చాల్సిందే.

పాపియైనవాడు నిర్ణీత సమయంలో బగ్గుమని విస్ఫోటించే బాంబును ఒంటగట్టుకొని జీవిస్తున్నాడు. వాడు చావకుండా యింకా ఎంతో కొంత సమయం మిగిలియుండవచ్చును, కానీ ఆ బాంబు ఏదో ఒకనాడు తప్పక పేలిపోతుంది. ఆయన తన ప్రణాళిక మరియు ఉద్దేశములకు పొందికగా, అయనే దేవుడైన యెహోవాయై యున్నాడని సకల జనులు తెలిసికొనునట్లు దేవుడు న్యాయము తీర్చుటకు లేచును. “పడమటి దిక్కున నున్నవారు యెహోవా నామమునకు భయపడుదురు మరియు సూర్యోదయ దిక్కునున్నవారు ఆయన మహిమకు భయపడుదురు, యెహోవా పుట్టించు గాలికి కొట్టుకొనిపోవు ప్రవాహ జలమువలె ఆయన వచ్చును” (వచనం 19).

పాపము యొక్క స్వభావమునుబట్టియే, యెషయా ఒక ప్రసంగం, పరిశుద్ధ బైబిలు ప్రబోధించు ప్రసంగం మాత్రమే, చేయాల్సిన అవసరం ఏర్పడింది: పశ్చాత్తాపము. మనము పాపముతో మనంతట మనమే గెలువలేము. ఏదిఏమైనా, దేవుని కృప ద్వారా, మనము

పాపముపై విజయము సాధించగలము. " 'సీయోను నొద్దకును, యాకోబులో తిరుగుబాటు చేయుట మాని మళ్లుకొనిన వారి యొద్దకును విమోచకుడు వచ్చును.' ఇదే యెహోవా వాక్కు" (వచనం 20). దేవుడు యింకా వేచియుంటాడు మరియు అందుబాటులో నుండు సమయమునుబట్టి పశ్చాత్తాపడవలెనని ఆయన ప్రజలకు పిలుపునిస్తాడు.

---

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

---

### ❖❖❖ ఒక ఎడబాటు ❖❖❖
### (59:1-5)

పరస్పర విరుద్ధమైన ఒక సామ్యమును సృజించుటకు యెషయా 59:1, 2లో రెండు సమానార్థక సామ్యములు ఒక్క చోట ఉంచబడినవి. "రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచ కాలేదు" అను వాక్యము "విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు"తో సమానార్థకమైనదై యున్నది. దేవుడు యూదా ప్రజలను రక్షించగలడని యెషయా చెప్పుచున్నాడు, కానీ వారిప్పుడు జీవించుచున్న రీతినే యిక ముందుకును జీవించుచుండునంత కాలము ఆయన వారిని రక్షించడు. వారి దోషములు వారిని దేవుని నుండి వేరుచేసాయి. ప్రజలలో అదుపులేకుండా వ్యాపించియుండిన దోషమేమిటో 3-5 వచనములు వర్ణించుచున్నవి. వారు చెడు విషయాలలో జోక్యము చేసికొనవలెననియు "నిరపరాధుల రక్తము చిందించుటకును" ఆతురపడుచుండిరి (వచనం 7; రోమీయులకు 3:15-17 చూడుము). వారు ఒకరినొకరు విధ్వంసం చేసికొనుటకు ప్రయత్నించుచుండిరి!